



VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 78 | మంగళవారం 18 ఆగష్టు, 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం: అమిత్ షా

- ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్‌షా
- స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దాడుల కుట్రను భగ్నం చేశామన్న అమిత్ షా
- 14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్



2

## బ్రిటన్ రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో ఫైటర్ పైలట్‌గా భారత సంతతి యువకుడి ఘనత

- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ విజయం సాధించిన తొలి సిక్కుగా అర్ష్‌దీప్ రికార్డు
- తన తాతయ్య కలను తాను నెరవేర్చానని వెల్లడించిన అర్ష్‌దీప్ సింగ్ డాంగ్
- కుటుంబ ప్రోత్సాహం, సిక్కు సంప్రదాయాలే తన విజయానికి కారణమని వెల్లడి



2

## డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి: వైసీపీకి చంద్రబాబు సవాల్



2

- మెగా డీఎస్సీ నియామకాల్లో అంతా పారదర్శకమేనన్న సీఎం చంద్రబాబు
- అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం
- డీఎస్సీ పై వైసీపీది హిట్ అండ్ రన్ తరహా దుష్ప్రచారం అంటూ ఫైర్
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ప్రతిపక్షానికి సవాల్
- 148 రోజుల్లో 15,941 ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశామని వెల్లడి
- అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారని విమర్శ

## ప్రజలకు అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్.. ప్రారంభించనున్న సీఎం రేవంత్

- హైదరాబాద్ ఎర్రగడ్డలో అత్యాధునిక సౌకర్యాలతో 'టిమ్స్'
- రూ.1100 కోట్ల వ్యయంతో వెయ్యి పడకల సామర్థ్యంతో నిర్మాణం
- సోమవారం సాయంత్రం లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం
- హాజరుకానున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రారంభ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ




2

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లను యథాతథంగా కొనసాగించాలన్న ప్రవీణ్ కుమార్

తెలంగాణలో పేదల సంక్షేమానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను రద్దు చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ పథకాలను యథాతథంగా కొనసాగించాలని, అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాల పై సమగ్ర విచారణ జరిపి అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.



2

## సొంత పార్టీ పై కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి సంచలన ఆరోపణలు!



2

- గత ఎన్నికల్లో టికెట్ రాకపోవడం పై చిన్నారెడ్డి ఆగ్రహం
- డబ్బుల ఆశతో తనకు టికెట్ ఇవ్వలేదని ఆరోపణ
- వనపర్తిని సర్వనాశనం చేస్తున్నారని వ్యాఖ్య
- కాంగ్రెస్‌లో కొన్ని తప్పులు జరుగుతున్నాయని వెల్లడి
- పార్టీకి అన్యాయం చేసేవారిని బయటకు పంపుతామన్న చిన్నారెడ్డి

## 22వ రోజూ విజయవంతం.. 64 లక్షల ఇళ్లకు 'ఇంటింటికీ తెలుగుదేశం-2026'




2

- విజయవంతంగా 22వ రోజుకు చేరిన 'ఇంటింటికీ తెలుగుదేశం'
- రాష్ట్రవ్యాప్తంగా 64.21 లక్షల కుటుంబాలను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారం
- ప్రజల నుంచి అభిప్రాయాలు, స్థానిక సమస్యల సేకరణ
- 60 లక్షల ఇళ్ల మైలురాయిని దాటి ఉత్సాహంగా ముందుకు

VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం: అమిత్ షా

పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని,ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మంది కి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు.కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏక కాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లలో మొత్తం 253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు.ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

# బ్రిటన్ రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో ఫైటర్ పైలట్‌గా భారత సంతతి యువకుడి ఘనత

బ్రిటన్ రాయల్ ఎయిర్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) చరిత్రలో భారత సంతతికి చెందిన ఓ యువకుడు అరుదైన, చారిత్రక ఘనతను సాధించారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారిగా ఓ సిక్కు యువకుడు ఫైటర్ పైలట్‌గా పట్టభద్రుడై రికార్డు సృష్టించారు. 28 ఏళ్ల ఫ్లైట్ లెఫ్టినెంట్ అర్ష్‌దీప్ సింగ్ డాంగ్ ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ఆగస్టు 14వ తేదీన నార్త్ వేల్స్‌లోని ఆర్ఏఎఫ్ వ్యాలీలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. చండీగఢ్‌లో 1998లో జన్మించిన అర్ష్‌దీప్, తన ఆరేళ్ల వయసులో కుటుంబంతో కలిసి యూకేకి వలస వెళ్లారు. ఆయన తండ్రి జగదీప్ సింగ్ డాంగ్ పంజాబ్‌లోని లూథియానాకు చెందిన వారు కాగా, తల్లి గగన్‌దీప్ కౌర్ అమృత్‌సర్‌కు చెందినవారు. ప్రస్తుతం ఈ కుటుంబం ఇంగ్లండ్‌లోని సౌత్‌హాల్‌లో నివసిస్తోంది. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ అర్ష్‌దీప్ తన ప్రయాణం వెనుక ఉన్న స్ఫూర్తి దాయకమైన కథను పంచుకున్నారు. "మా నాన్న పైలట్ కావాలన్నది మా తాతయ్య సర్దార్ సంతోఖ్ సింగ్ డాంగ్ కల. కానీ నాన్నకు ఆరేళ్లు ఉన్నప్పుడే తాతయ్య చనిపోయారు. దీంతో ఆ కలను నెరవేర్చుకునే అవకాశాలు, వనరులు నాన్నకు లభించలేదు. కానీ నా తల్లిదండ్రులు నన్ను ప్రోత్సహించారు. నేను పైలట్ కాగలనని నమ్మాను. ఇప్పుడు అది నిజమైంది" అని ఆయన వివరించారు. తన తల్లి తనకు ఎల్లప్పుడూ ఒక బలమైన స్తంభంలా నిలిచారని అర్ష్‌దీప్ పేర్కొన్నారు. బ్రిస్టల్ విశ్వవిద్యాలయంలో గణితం, ఫిలాసఫీ చదివిన అర్ష్‌దీప్, 2022లో ఆఫీసర్ శిక్షణ పూర్తి చేశారు. అనేక దశల కఠిన శిక్షణ తర్వాత, టెక్సాన్ విమానంలో శిక్షణ పొందిన తొలి సిక్కు ట్రెయినీగా కూడా ఆయన గుర్తింపు పొందారు. ఫ్రంట్‌లైన్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ నడిపే ముందు ఆయన మరో ఏడాది పాటు తీవ్రమైన శిక్షణ పొందనున్నారు. "అంతర్జాతీయ స్థాయిలో నా సమాజానికి ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ ఘనత సాధించిన మొదటి సిక్కును నేనే, కానీ చివరివాడిని కాకూడదనుకుంటున్నా" అని అర్ష్‌దీప్ ఆశాభావం వ్యక్తం చేశారు. తన ప్రయాణంలో సిక్కు మత విశ్వాసమైన 'చడ్డీ కలా' (ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉండటం) క్లిష్టమైన సమయాల్లో ఎంతో సహాయపడిందని తెలిపారు. ఒకప్పుడు మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో ఇంద్ర లాల్ రాయ్, హర్దిత్ సింగ్ మాలిక్ వంటి భారతీయ పైలట్లు బ్రిటిష్ సైన్యంలో సేవలందించగా, ఇప్పుడు వారి వారసత్వాన్ని అర్ష్‌దీప్ కొనసాగిస్తున్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లను యథాతథంగా కొనసాగించాలన్న ప్రవీణ్ కుమార్

ఈ పథకాలను యథాతథంగా కొనసాగించాలని, అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాల పై సమగ్ర విచారణ జరిపి అర్హులైన పేదలకు ఇళ్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భరత్ కుమార్ ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన భారీ ధర్నాలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ పథకాలపై కోర్టులో విచారణ జరుగుతున్న విషయం తెలిసి కూడా, కావాలనే ప్రభుత్వం తరఫున సరైన వాదనలు వినిపించకుండా కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు వచ్చేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ ఉన్నప్పటికీ,ఈ సంక్షేమ పథకాలను నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతుండటం విచారకరమన్నారు. అలాగే నల్గొండ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు లో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకుని అనర్హులకు ఇచ్చారని, దీని పై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ కొంత ఉద్రిక్తత నెలకొంది. జాయింట్ కలెక్టర్ మెమోరాండం స్వీకరించేందుకు రాగా బీఆర్ఎస్ నాయకులు ఇచ్చేందుకు నిరాకరించారు. చివరకు గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌ను కలవడానికి పోలీసులు అనుమతించడంతో, నాయకులు కలెక్టర్‌ను నేరుగా కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు.

# ప్రజలకు అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్.. ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్ నగర వైద్య మౌలిక సదుపాయాల్లో మరో కీలక అధ్యాయానికి సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఎర్రగడ్డలో అత్యాధునిక వసతులతో నిర్మించిన మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డా.ఎంసీఆర్ టిమ్స్) సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం 4.30 గంటలకు లాంఛనంగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. సుమారు 22.6 ఎకరాల సువిశాల ప్రాంగణంలో రూ.1,100 కోట్ల భారీ వ్యయంతో ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించారు. వెయ్యి పడకల సామర్థ్యంతో, ఐదు బ్లాకులతో దీనిని అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే ఆసుపత్రిలో ట్రయల్ రన్ నిర్వహించి, డే కేర్ విభాగాలను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ క్రమంలో రోజుకు సుమారు 250 మంది రోగులకు వైద్య సేవలు అందిస్తూ వస్తున్నారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ప్రధాన ఆసుపత్రుల నుంచి బదిలీపై వచ్చిన వారితో పాటు కొత్తగా నియమితులైన దాదాపు 200 మంది వైద్య సిబ్బంది ఇక్కడ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. మాజీ డీఎంఈ డా.ఎ.నరేంద్రకుమార్ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా, మాజీ ఏడీఎంఈ డా.మహబూబ్ ఖాన్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరించనున్నారు. ఆసుపత్రి ప్రారంభోత్సవం నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం ఏర్పాట్లను సమీక్షించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భద్రతాపరమైన లోపాలు లేకుండా చూడాలని పోలీసు శాఖకు స్పష్టం చేశారు.

# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి: వైసీపీకి చంద్రబాబు సవాల్

మెగా డీఎస్సీ నియామకాల్లో ఒక్క డీవియేషన్ కూడా జరగలేదని, ప్రతిభ ఆధారంగానే అత్యంత పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశంపై వైసీపీ చేస్తున్నది కేవలం హిట్ అండ్ రన్ ఆరోపణలేనని, వారికి దమ్ము, ధైర్యం ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు. ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్ జీ వృద్ధులతో ఫేక్ ప్రదర్శనలు చేయిస్తూ డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు.

**విద్యాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంది**

విద్యార్థులకు మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే వారే అత్యుత్తమ మానవ వనరులుగా తయారవుతారని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, మహిళా యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, మండలానికి ఓ జూనియర్ కాలేజీ, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు. 2019-24 మధ్య ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయని పాలకులు, విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు 14 డీఎస్సీలు జరిగితే, వాటిలో 11 డీఎస్సీలను టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలోనే నిర్వహించి,అవినీతికి ఆస్కారం లేకుండా నియామకాలు చేపట్టామని వివరించారు.

**148 రోజుల్లోనే పారదర్శకంగా నియామకాలు**

గత పాలకులు ఐదేళ్లలో చేయలేని పనిని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకంతో చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలను కేవలం 148 రోజుల్లోనే పారదర్శకంగా భర్తీ చేశామని వివరించారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియ వరకు అన్నీ కట్టుదిట్టంగా చేపట్టామన్నారు. 13 సబ్జెక్టులకు 42 వేల ప్రశ్నలను ఎంపిక చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశామని తెలిపారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేశామని, నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయని, ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఫిర్యాదుల పరిష్కారానికి జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలతో పాటు అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

# 22వ రోజూ విజయవంతం.. 64 లక్షల ఇళ్లకు 'ఇంటింటికీ తెలుగుదేశం-2026'

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. 22వ రోజుకు చేరుకున్న ఈ కార్యక్రమం ద్వారా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే 64 లక్షలకు పైగా కుటుంబాలను నేరుగా కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ ప్రచారంలో ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. సోమవారం నాటికి ఈ కార్యక్రమం 22 రోజులు పూర్తి చేసుకుంది. 22వ రోజున రాష్ట్రవ్యాప్తంగా 2.60 లక్షల ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించాయి. దీంతో ఇప్పటివరకు మొత్తం 64.21 లక్షల కుటుంబాలను నేరుగా చేరుకున్నట్లయింది. ఇప్పటికే 60 లక్షల ఇళ్ల సందర్శన మైలురాయిని అధిగమించడంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఈ ఇంటింటి పర్యటనల్లో భాగంగా, టీడీపీ నాయకులు గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతు సంక్షేమం, మహిళలు, యువతకు అందిస్తున్న ప్రయోజనాలు, మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాలు వంటి అంశాలను ప్రతి కుటుంబం దృష్టికి తీసుకెళుతున్నారు. కేవలం ప్రభుత్వ విజయాలను వివరించడమే కాకుండా, ప్రజలతో నేరుగా సంభాషిస్తూ వారి అభిప్రాయాలు, స్థానిక సమస్యలు, అవసరాలను కూడా అడిగి తెలుసుకుంటున్నారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ పాలన ఫలాలను ప్రతి గడపకు చేరవేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు.

# సొంత పార్టీ పై కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి సంచలన ఆరోపణలు!

కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో తనకు టికెట్ రాకపోవడానికి డబ్బు కారణమని ఆరోపించారు. వనపర్తిని సర్వనాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అన్నీ భరిస్తూ పార్టీలో కొనసాగుతున్నానని చెప్పారు. లేదంటే మరో జీవన్‌రెడ్డిలా పార్టీకి దూరమయ్యేవాడినని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో కొన్ని తప్పులు జరుగుతున్నాయని అన్నారు. పార్టీకి అన్యాయం చేస్తున్న వారిని బయటకు పంపిస్తామని స్పష్టం చేశారు. 45 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ నిర్మాణం కోసం తాను ఎంతో కష్టపడ్డానని చిన్నారెడ్డి చెప్పారు. పార్టీ జెండాను ఎప్పుడూ మోయని వారికి టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్‌లో ఉండి తర్వాత బీఆర్ఎస్‌లో చేరినవారు.. అక్కడ సంపాదించుకుని తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చారని అన్నారు. అలాంటి వారికి మళ్లీ టికెట్లు ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. 'ఇదా కాంగ్రెస్ పార్టీ? ఇదా రాజకీయం?' అంటూ ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉండి ఉంటే వనపర్తికి మహర్దశ వచ్చేదని చిన్నారెడ్డి అన్నారు. తనకు అవకాశం ఇచ్చి ఉంటే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేవాడినని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధిస్తున్నాయని తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని చిన్నారెడ్డి స్పష్టం చేశారు. పార్టీలోనే ఉంటూ తప్పులను ప్రశ్నిస్తానని చెప్పారు. కాంగ్రెస్‌కు అన్యాయం చేసే వారిని బయటకు పంపిస్తామని హెచ్చరించారు.

# ఝార్ఖండ్ విద్యార్థుల కోసం రాహుల్ లేఖ..

ఝార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థుల ఆందోళన కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు సోమవారం లేఖ రాశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల ప్రతినిధులతో సీఎం స్వయంగా సమావేశం కావాలని కోరారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్‌తో కలిసి ఇండియా కూటమిలో ఉన్న ఝార్ఖండ్ ముక్తి మోర్చా ప్రభుత్వానికి హేమంత్ సోరెన్ నేతృత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) నిర్వహించిన నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో 24 రోజులుగా నిరసన కొనసాగుతోంది. కొందరు విద్యార్థులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు.విద్యార్థుల శాంతియుత నిరసనకు రాజ్యాంగం హక్కు కల్పించిందని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు. పేపర్ లీకులు, పరీక్షల్లో అక్రమాల పై నిరసనలు చేస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. విద్యార్థులతో ప్రభుత్వం ఇప్పటికే చర్చలు ప్రారంభించడం అభినందనీయమని రాహుల్ పేర్కొన్నారు. పలు డిమాండ్ల పై అంగీ కారం కుదిరినట్లు తెలుస్తోందన్నారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి సీఎం స్వయంగా విద్యార్థులతో మాట్లాడితే ప్రభుత్వంపై నమ్మకం మరింత పెరుగుతుందని సూచించారు. విద్యార్థుల ఉద్యమం పై ప్రభుత్వం, నిరసనకారుల మధ్య సోమవారం నాలుగో విడత చర్చలు జరగనున్నాయి. చర్చల తర్వాత ఉద్యమ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తమ డిమాండ్ల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థులు ఆగస్టు 20న సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని ఇప్పటికే ప్రకటించారు.

# రేవంత్ ఇల్లు కూడా నిషేధిత జాబితాలో ఉంది: హరీశ్ రావు

- జాబితా నుంచి సీఎం ఇంటిని తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణ
- నిషేధిత ఆస్తుల జాబితాపై విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- సామాన్యుల పరిస్థితి ఏమిటన్న హరీశ్ రావు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం కూడా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉందని, దానిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం తెరవెనుక ప్రయత్నాలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి నివాసానికే ఈ పరిస్థితి ఎదురైతే, ఇక సామాన్య ప్రజల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చారో విచారణ జరపాలని, ఆ జాబితాలో ఉన్న ఆస్తులు పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రావడం లేదని ఆయన విమర్శించారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 18 ఆగష్టు, 2026

# ఎపియుడబ్లుజె ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నంద్యాలలో జెండావిష్కరణ, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం








**– జర్నలిస్టుల సమస్యల పరిష్కారాని కై జాయింట్ కలెక్టర్ కు వినతి పత్రం**

**నంద్యాల ఆగస్టు 17 వార్త సాక్ష్యం**

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్లుజె) 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎపియుడబ్లుజె నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎపియు డబ్ల్యుజె జెండాను యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఖండే శ్యాం సుందర్ లాల్, గౌరవ సలహాదారులు, సీనియర్ పాత్రికేయులు ఎం. జనార్దన్ రెడ్డి, కనకరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుబాబు, ఉస్మాన్ భాష, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజ్ కుమార్ రెడ్డి, వైపై బాషా, సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలనీ, రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ అమలులో ఉన్న నెట్ వర్క్ ఆస్పత్రులలో ఎదురవుతున్న ఇబ్బందుల వల్ల పలువురు జర్నలిస్టులు ఆరోగ్య ప్రయోజనాలు పొందలేకపోతున్నారని, బకాయిలున్నాయన్న పేరుతో నెట్ వర్క్ ఆస్పత్రులలో హెల్త్ కార్డును అనుమతించుట లేదని, కావున జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ను ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని కోరారు. పథకం అమల్లో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో ఒక త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలనీ, తద్వారా జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని కూటమి ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయినా ఇప్పటివరకూ మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం మినహా ఒక్క అడుగు ముందుకు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2018-19లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకం ఆచరణలో అమలుకు నోచుకోలేదని, అందువల్ల ఇళ్ల స్థలాల విషయమై సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు వృత్తి ద్వారా సమాజానికి చేసిన సేవలను, వారికి తగిన వేతనాలు గానీ, ఉద్యోగ విరమణ పింఛను గానీ లేని పరిస్థితులను, వారి వయసును దృష్టిలో ఉంచుకుని విశ్రాంత జీవితాన్ని గౌరవప్రదంగా గడపడానికి వీలుగా పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత్రికేయ పింఛను పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రారంభించాలని, జర్నలిస్టులపై పెరిగిపోతున్న భౌతిక దాడులు, బెదిరింపులు, దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రతకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు












**– ఐకమత్యంతో భారీగా తరలివచ్చిన పాత్రికేయులు**
**– సమస్యల పరిష్కారానికి ఆత్మకూరుఆర్డీఓ వెంకట శివకు వినతిపత్రం**

**ఆత్మకూరు ఆగస్టు 17 వార్త సాక్ష్యం**

ఆత్మకూరు పట్టణంలో సోమవారం ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను యూనియన్ నాయకులు, పాత్రికేయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాత్రికేయులు తరలివచ్చి ఐకమత్యాన్ని చాటారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ రాయుడు ఆధ్వర్యంలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధితులు, బాలింతలు, గర్భిణులకు యూనియన్ నాయకులు ఫలహారాలను పంపిణీ చేశారు. అనంతరం పాత్రికేయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆత్మకూరు ఆర్డీఓ వెంకట శివకు యూనియన్ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. పాత్రికేయుల సమస్యల పై ఆర్డీఓ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నాయకులు శ్యామ్, శివగౌడ్, చంద్రయ్య, సగినేల రవికుమార్, సీనియర్ జర్నలిస్ట్ శీలం శేషుల తో పాటు ఆత్మకూరు ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి ఎస్.కే. సైపుద్దీన్‌లు మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమిష్టి కృషితోనే పోరాటాలు విజయవంతమవుతాయని అన్నారు. ముఖ్యంగా పాత్రికేయులకు పలు ప్రధాన డిమాండ్లు వర్కింగ్ జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలి. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (ఔజీఎూ) అమలులో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలి. ప్రభుత్వం నుంచి బకాయిలు ఉన్నాయన్న కారణంతో అనేక సందర్భాల్లో నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఔజీఎూ కార్డులను అనుమతించకపోవడం, కొన్ని వైద్య ప్రక్రియలకు కార్డు వర్తించకపోవడం వంటి లోటుపాట్లను సరిచేయాలి. పథకం అమల్లో ఎదురవుతున్నరోజువారీ సమస్యల పరిష్కారానికి సమాచార శాఖ, ఎన్టీఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో త్రైపాక్షిక పర్యవేక్షక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని కూటమి ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయినప్పటికీ ఇళ్ల స్థలాల విషయంలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం మినహా ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో చర్యలు జరగలేదని నాయకులుపేర్కొన్నారు. 2018-19లో ఎన్నికల ముందు ప్రకటించిన హౌసింగ్ పథకాన్ని కూడా ఆచరణలోకి తీసుకు రావాలని కోరారు. జర్నలిస్టులు వృత్తి ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి,వారికి తగిన వేతనాలు లేదా ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ లేని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గౌరవప్రదమైన విశ్రాంత జీవితానికి వీలుగా ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న తరహాలో పాత్రికేయ పింఛను పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రారంభించాలి. జర్నలిస్టుల పై పెరుగుతున్న భౌతిక దాడులు, బెదిరింపులను అరికట్టేందుకు రాష్ట్రంలో జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం సంఘటితంగా పోరాడుతూ సమస్యల పరిష్కారం సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగి స్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మల్లయ్య, శ్రీనివాసులు, బాలరాజు, సల్మాన్,ఐ న్యూస్ శ్రీను, సుధాకర్, ఓబులేసు, వాహిద్, చంద్ర, అన్వర్, బీసేశ్వరరావు, జీ న్యూస్ శివ, బలరాముడు, హరీష్, శ్యామ్, రాజు, రమణ, ఖాదర్, పరశురాం సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ రైతులకు 85% సబ్సిడీతో గొర్రెలు మేకల పశు భీమా పథకం సద్వినియోగం చేసుకోండి

**– పాములపాడు పశుసంవర్ధక శాఖ వైద్య అధికారి భాస్కర్**

**పాములపాడు ఆగస్టు 17 వార్త సాక్ష్యం**

పాములపాడు మండల లోని గ్రామీణ ప్రాంతాల పాడి పరిశ్రమ రైతులు 2026-27 కు సంబంధించిన 220 గొర్రెలు మేకల పశు భీమా లక్ష్యంగ నిర్దేశించడం జరిగిందని పాములపాడు పశువైద్యాధికారి డాక్టర్ భాస్కర్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ గొర్రెల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు ఏవైనా వివరాలు కావాలంటే సమీపంలోని రైతుసేవ కేంద్రం లోని అనుమల్ హస్బెం డ్రి అసిస్టెంట్ ను, పశు వైద్యాధికారికి సంప్రదించాలని తెలిపారు. 6 నెలలు దాటిన గొర్రెలు మేకలు భీమా చేయించుకునే విధంగా అవకాశాలు ఉన్నాయని అన్నారు. 1 సంవత్సరము రూ 6000 భీమా కొరకు చెల్లించవలసిన ప్రీమియం రూ 180 కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ 153 పోను లబ్ది దారుడు కేవలం రూ 27 చెల్లిస్తే సరిపోతుంది అని అన్నారు. ప్రతి గొర్రె, మేక కి తప్పని సరిగా చెవి పోగు /ట్యాగ్ వేయించాలి. అని తెలియజేశారు. ఎప్పుడైనా చెవి పోగు / ట్యాగ్ పడిపోతే వెంటనే పశు వైద్య సిబ్బంది చేత కొత్త ట్యాగ్ వేయించాలి. ట్యాగ్



లేనిచో భీమా వర్తించదు అని వివరించారు. ఈ సమావేశంలో సిబ్బంది తిరుమలేశ్ కవిత పాల్గొన్నారు

## నేటి నుంచి చిప్పగిరిలో తి.తి.దే. ధార్మిక కార్యక్రమాలు

**– గ్రామ ప్రజలు,భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయండి**
**– డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి.తి.దే.**





**కర్నూలు ఆగస్టు 17 వార్త సాక్ష్యం**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన చిప్పగిరిలో వెలసిన శ్రీ గోవిందప్ప స్వామి దేవస్థానంలో నేటినుండి శుక్రవారం వరకు సాయంత్రం 6 గంటల నుండి మూడు రోజుల పాటు స్వాత్మానంద స్వామిచే ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం ఉదయం 10 గంటలకు గోపూజ మరియు సామూహిక కుంకుమార్చనలు శనివారం శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం నందు భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంచే,ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు నాగనాథనహళ్ళి రాఘువాచార్ ఎల్. రామచంద్ర, పి. గురుప్రసాద్, పి.వి.యం. చెన్నవీరయ్యస్వామి, యం. లక్మీ నారాయణ, యస్. లోకేశ్, పి.షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు పురపాలక సంఘంలో పట్టణ పరిశుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణ, పై ప్రత్యేక చొరవ నీటి పొదుపు, పన్నుల చెల్లింపులో ప్రజలు సహకరించాలి

**– పురపాలక సంఘం కమిషనర్ ఏ.బేబీ**






**ఆత్మకూరు ఆగస్టు 17 వార్త సాక్ష్యం**

ఆత్మకూరు పురపాలక సంఘం పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా మరియు ఆరోగ్యకరంగా ఉంచే విషయంలో పట్టణ ప్రజలు, వ్యాపారులు మరియు వ్యాపార సంఘాల ప్రతినిధులు మున్సిపాలిటీకి సంపూర్ణ సహకారం అందించాలని పురపాలక సంఘం కమిషనర్ ఏ. బేబీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా, మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ వచ్చి సేకరిస్తున్న చెత్తను వారికి అందజేయాలి. అలాగే మురుగు కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయకుండా సహకరించాలి. మురుగు కాలువల్లో చెత్త వేయడం వల్ల నీరు నిలిచిపోయి దోమల ఉత్పత్తి పెరిగి, ప్రజారోగ్యానికి హాని కలిగే అవకాశం ఉంది. పట్టణ పరిశుభ్రతను కాపాడటంలో భాగంగా ప్రజలు మరియు వ్యాపారులు ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిస్థాయిలో తగ్గించాలి. ముఖ్యంగా 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి అత్యంత హానికరమైనది. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణ కాలుష్యానికి కారణమవడమే కాకుండా, రానున్న భవిష్యత్ తరాలకు కూడా తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉంది. కావున ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. పట్టణంలోని వ్యాపారులు, వ్యాపార సంస్థలు మరియు మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు మున్సిపల్ అధికారులకు సహకరించి ప్లాస్టిక్ మహమ్మారి నుంచి పట్టణాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని కోరడమైనది. అదేవిధంగా, ప్రస్తుతం వర్షాలు సక్రమంగా లేకపోవడంతో పట్టణంలోని బోర్లు మరియు భూగర్భ జలాల నీటిమట్టం తగ్గిపోతున్నందున ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలి. పట్టణంలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించడమైనది. పట్టణ అభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులు సమకూర్చడంలో పన్నుల వసూళ్లు కీలకమైనవి. అందువల్ల పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ట్రేడ్ ట్యాక్సులు మరియు ఇతర మున్సిపల్ పన్నులు, రుసుములను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని తెలియజేశారు. పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు మరియు పట్టణ అభివృద్ధి అనేవి కేవలం మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి "మన పట్టణం మన బాధ్యత" అనే స్ఫూర్తితో మున్సిపాలిటీకి సహకరించాలని ప్రజల్ని కోరారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్‌లో ఉత్తమ సేవ అవార్డు డీఎస్పీ, ఆర్. రామంజి నాయక్ కు ఘన సన్మానం

– ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ ఎ.షహబుద్దీన్



ఆత్మకూరు ఆగస్టు 17 వార్త సాక్ష్యం

ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్లో ప్రజలకు విస్తృత సేవలు అందించిన ఆత్మకూరు డిఎస్పి ఆర్. రామంజి నాయక్ కు 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవ పురస్కారం అవార్డు రావడం పై సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ ఏ. షహబుద్దీన్ తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి వేణు గోపాల్, క్లస్టర్ ఇంచార్జ్ లు రాజారెడ్డి దినకర్ రావుల ఆధ్వర్యంలో డి.ఎస్. పికి పూలమాలతో శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్ధిన్. మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా, కుల,మత భేదాలు లేకుండా, పేద ,ధనిక అనే తేడా లేకుండా ప్రజలకు న్యాయం చేయడమే కాకుండా ,డివిజన్ పరిధిలో శాంతి భద్రత పరి రక్షణే పరమావధిగా భావించి పనిచేసే ఆత్మకూర్ డిఎస్పి రామంజి నాయక్ కు ఉత్తమ సేవ పురస్కార అవార్డు అందుకోవడం చాలా సంతోషకరమని అన్నారు భవిష్యత్తు లోనూ మరెన్నో ఉత్తమ సేవ పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్లో విధి నిర్వహణలో అలసత్వం వహించ కుండా అన్ని సామాజిక వర్గాల ప్రజలకు సమన్వయం చేస్తూ ఉత్తమ సేవ పురస్కారం అందుకోవడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు పోలీస్ శాఖలో ఎంతో కీలకమైన అధికారి స్థానంలో ఉంటూ అందర్నీ సమానత్వం గా చూస్తూ డీఎస్పీ అందిస్తున్న సేవలకు ఇలాంటి పురస్కారాలు మరెన్నో అందుకోవాలని ఆత్మకూరు ప్రాంత ప్రజల తరపున టిడిపి పార్టీ సీనియర్ నాయకులు డీఎస్పీ రామంజి నాయక్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## మృతి చెందిన ఆకుల.నాగేంద్ర కుటుంబానికి 5వేలు ఆర్థిక సహాయం

– వేంపెంట మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ



పాములపాడు ఆగస్టు 17 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని, వేంపెంట గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన ఆకుల నాగేంద్ర(50)పార్థివ దేహానికి మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ పూల మాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ధైర్యంగా ఉండాలని ఆ కుటుంబానికి మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ భరోసా ఇచ్చారు ఈ విషయం తెలుసుకొని సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి. నాగేశ్వరావు ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. వీరి వెంట మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, ముద్దపాటి ప్రసాద్, దార ప్రసన్న, బోనపల్లె సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ప్రక్రియకు సంబంధించిన పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

– నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ

నంద్యాల,ఆగస్టు 17 వార్త సాక్ష్యం



జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్ -2026) ప్రక్రియలో నోటీసుల జారీ, విచారణలు, ఫారాల పరిశీలన, ఓటర్ల వివరాల ధృవీకరణ తదితర ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా ఆదేశించారు.సోమవారం సాయంత్రం సర్ 2026 పక్రియ పై ఈ ఆర్ ఓలు,ఏ ఈ ఆర్ ఓ తో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షి స్తూ జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గా ల్లో మొత్తం 80,283 నోటీసులు జనరేట్ చేయాల్సి ఉండగా, 80,281 నోటీసులు జనరేట్ అయ్యాయి. వీటిలో 66,350 నోటీసులు డెలివరీ కాగా,13,931 నోటీసులు డెలివరీకి పెండింగ్‌లో ఉన్నాయి. నోటీసుల డెలివరీలో పెండింగ్ శాతం 17.35గా నమోదైంది అని తెలిపారు. నోటీసుల జారీ కి ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఫారం 6, 7,8 సంబంధించిన పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలి అన్నారు. బుక్ ఎ కాల్ విత్ బి ఎల్ ఓ సేవకు సంబంధించి పెండింగ్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి కావాలన్నారు. నోటీసుల డెలివరీలో పెండింగ్‌ను తగ్గించడంతో పాటు, విచారణలు, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిశీలన మరియు పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా సర్ ప్రక్రియను పూర్తి చేసి తుది ఓటర్ల జాబితా ప్రచురణకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు

# ఆపదలో పేద కుటుంబానికి అండగా నిలిచిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం

– శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు.

– ఎల్ ఓ సి మంజూరు లెటర్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేత

– శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు వై.యుగంధర్ రెడ్డి.



ఆత్మకూరు ఆగస్టు 17 వార్త సాక్ష్యం

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సున్నిపెంటకు చెందిన శ్రీ అధ్యం శివ ప్రసాద్ కుటుంబానికి కష్టకాలంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. మెరుగైన వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2,45,257/- ఆర్థిక సహాయం మంజూరైంది. చికిత్స ఖర్చులు రోజురోజుకూ భారమవుతున్న సమయంలో, తమ కుటుంబ సభ్యుడి ప్రాణాలను కాపాడుకోవాలనే ఆందోళనలో ఉన్న శివ ప్రసాద్ కుటుంబానికి ఈ సహాయం ఎంతో ధైర్యాన్ని, భరోసాను కల్పించింది. ఆపదలో ఉన్న తమ కుటుంబానికి ప్రభుత్వం, శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అండగా నిలవడంతో కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.శివ ప్రసాద్ పరిస్థితిని తెలుసుకున్న శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సహాయం అందేలా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, గుంటూరులోని మెడ్‌స్టార్ హాస్పిటల్‌లో శివ ప్రసాద్ చికిత్సకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.2,45,257 వరకు సహాయం అందించేందుకు అనుమతి ఇచ్చింది. "కష్టకాలంలో మాకు ఎవరు అండగా ఉంటారో తెలియని పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రభుత్వం మా కుటుంబానికి ఒక భరోసాగా నిలిచింది. ఈ సహాయం మా కుటుంబానికి కేవలం ఆర్థిక సహాయం కాద ఒక ప్రాణాన్ని నిలబెట్టుకునే ధైర్యం" అని శివ ప్రసాద్ కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుటుంబం పడుతున్న బాధను అర్థం చేసుకుని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ సమస్యను పట్టించుకుని, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి, సీఎంఆర్ఎఫ్ సహాయం మంజూరయ్యేలా కృషి చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "మా కుటుంబం కష్టాల్లో ఉన్న సమయంలో మా బాధను తమ బాధగా భావించి స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, మా తరఫున నిలబడి సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి కి జీవితాంతం రుణపడి ఉంటాం" అని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు సోమవారం విజయవాడలో శివప్రసాద్ కుటుంబ సభ్యులకు శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ నాయకుడు వై. యుగంధర్ రెడ్డి ఎల్ ఓ సి మంజూరు లెటర్ అందజేశారు. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక ఆశాకిరణంగా, ఆపన్నహస్తంగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. తమ కుటుంబానికి ఈ క్లిష్ట సమయంలో అందించిన ఆర్థిక సహాయాన్ని ఎప్పటికీ మరచిపోలేమని, తమ కృతజ్ఞతలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని శివ ప్రసాద్ కుటుంబ సభ్యులు తెలిపారు.

# ముష్టపల్లి గ్రామంలో.. వర్షం కోసం గ్రామ దేవుళ్లకు ప్రత్యేక పూజలు







– గ్రామ కోనేటి బావిలో నుంచి 101 బిందెలతో మొక్కులు తీర్చుకున్న గ్రామ ప్రజలు

– రైతుల పాడిపంటలు, గ్రామ ప్రజల క్షేమం కోసం వర్షం కోసం యువత ముందుకు

ఆత్మకూరు ఆగస్టు 17 వార్త సాక్ష్యం

వర్షాలు లేక రైతన్నలు సాగుచేసిన పంటలు, ఎండిపోతు, గ్రామ ప్రజలకు నోరులేని మూగజీవాలకు సకాలంలో సమృద్ధిగా వర్షాలు పడి పచ్చని పంట పొలాలు కళకళలాడాలంటూ సోమవారం మండల పరిధిలోని ముష్టపల్లి గ్రామంలో గ్రామ యువకుల ఆధ్వర్యంలో గ్రామ దేవుళ్లకు వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు గ్రామంలో వెలిసిన శివాలయం నుంచి గ్రామ పొలిమేర వరకు అందరి దేవుళ్లను వర్షం కోసం గ్రామ కోనేటి బావిలో నుంచి 101 బిందెలతో దేవుళ్ళ పాదాల చెంత కోనేటి నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు వర్షాలు లేక రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోతుంటే వర్షం కోసం యువకులు గ్రామ ప్రజలు అందరూ



కలిసికట్టుగా గ్రామ దేవుళ్లకు మొక్కులు తీర్చడం విశేషంగా మారింది

# ఉపాధి కూలీ మహిళల రక్షణ కోసమే శక్తి యాప్

– మహిళలు చట్టాలపై అవగాహన కల్పించుకోవడంలో ముందుండాలి

– వడ్లమాపురం గ్రామంలో శక్తి యాప్ పై ఉపాధి కూలీలతో సమావేశం

– పాములపాడు ఏఎస్ఐ, షేక్. నూర్ అహమ్మద్



ఆత్మకూరు ఆగస్టు 17 వార్త సాక్ష్యం

ఆత్మకూరు పోలీస్ సబ్ డివిజన్ " శక్తి యాప్ టీం " ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలతో ఆత్మకూరు డి.ఎస్.పి ఆర్.రామాంజి నాయక్ ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ. మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణ లో ఆత్మకూరు " శక్తీ టీం "సిబ్బంది పాములపాడు ఏఎస్ఐ షేక్ నూర్ అహమ్మద్, సుప్రియల సహకారంతో సోమవారం మండల పరిధిలోని వడ్ల రామాపురం గ్రామంలో ఉపాధి కూలీల మహిళలకు " శక్తీ యాప్ పై అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శక్తి టీం ఎస్ఐ షేక్ నూర్ అహ్మద్ మాట్లాడుతూ "మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన "శక్తి యాప్" గురించి మరియు శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 గురించి తెలుపుతూ, మహిళల రక్షణకై ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి, బాల్యవివాహాలు, చిన్న పిల్లలపై నేరాలు జరగకుండా ఆపుటకు 1098 ఫిర్యాదు చేయవలెనని, 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయకూడదని అట్లా ఎవరయినా చేస్తునట్లయితే 112 కు గానీ, 1098 కి ఫోన్ చేసి చెప్పాలని తెలుపుతూ..ఉమన్ వెల్ఫేర్ 181, ఎమర్జెన్సీ కాల్ 112, 100 కి ఫోన్ చేయవలెనని, సైబర్ క్రైమ్ జరిగినచో టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయవలెనని, ఫేక్ కాల్స్,ఏపీకే ఫైల్స్ లాంటివి ఏదన్నా మీ పేరెంట్స్ సెల్ ఫోన్ వాట్సప్ లకు ఎవరైనా లింక్ మెసేజ్లు పంపితే వాటిని ఓపెన్ చేయొద్దు అని తెలుపుతూ వాటి ద్వారా వారికీ జరిగే ఆర్థిక నష్టాలను గురించి కూడా తెలిపి,వన్ స్టాప్ సెంటర్ యొక్క ప్రాముఖ్యతను వివరించడం అయినది, సార్. ఆండ్రాయిడ్ సెల్ ఫోన్లలలో శక్తీ యాప్ డౌన్ లోడ్ చేసుకొని అత్యవసర సమయాలలో శక్తీయాప్‌ను ఎలా వాడాలి, దానీ ఉపయోగాల గురించి తెలుపడమే కాకుండా మీరు మంచి క్రమశిక్షణతో మెలుగుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తూ ఆడపిల్లలను " ఈవిటీజింగ్ " పేరుతో ఎవరైనా ఆకతాయిలు అల్లరి పట్టించడం లాంటివి చేస్తే ఏ మాత్రం అధైర్య పడకుండా, మీకు భరోసాను మరియు ధైర్యాన్ని ఇచ్చే మీకు రక్షణ ఉండేలాగా మన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తీ యాప్ ను ఉపయోగించి 112 కు గానీ 1098 కి గానీ ఫోన్ చేసి సహాయం పొందవచ్చు అని అవేర్నెస్ చేసినాము.అదేవిధంగా 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మైనర్ విద్యార్థులు ఎవరు కూడా మోటార్ సైకిల్ ను నడపకూడదని తెలియజేశారు చదువు మీద ధ్యాస పెట్టి బాగా కష్టపడి చదివి మీ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని. చదువు ఒక్కటే మిమ్మల్ని సమాజంలో గౌరవాన్ని, మర్యాదను, హుందాతనాన్ని తీసుకొచ్చి మీ తలరాతలను మార్చేది చదువు ఒక్కటే అని తెలుపుతూ.. అదేవిధంగా మీ ఇంట్లోని మీ పేరెంట్స్ మోటార్ సైకిళ్లను నడిపేటప్పుడు ఖచ్చితంగా తలకు రక్షణగా" హెల్మెట్ " పెట్టుకొని ప్రయాణం చేయాలని హెల్మెట్ యొక్క ప్రాముఖ్యత ను తెలిపి మరియు ఎవ్వరూ కూడా మీ ఇంట్లోని వారు నాన్న, అన్నా, బాబాయి, మేనమామ లు ఎవ్వరైనా సరే మధ్యం త్రాగి వాహనాలను నడపవద్దని చెప్పమని సూచిస్తూ...త్రాగి వాహనం నడిపి పోలీస్ సార్వాళ్ళకు చిక్కి కేసు పెట్టి కోర్టు కు పంపిస్తే కోర్టు జడ్జి వారు 10వేల రూపాయలు ఫైన్ లేదా జైలు శిక్ష ను విధిస్తారు అని విద్యార్థిని విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో.. గాయపడిన యువకుడికి ఆర్థిక సహాయం

- కొక్కెరంచ గ్రామానికి చెందిన దినేష్ అనే యువకుడికి చికిత్స ఖర్చులకు ఆర్థిక సహాయం
- మానవత్వం చాటుకుని ముందుకు వచ్చిన తుమ్మలూరు ఆదర్శ యువజన సంఘం కమిటీ సభ్యుల బృందం
- దాతల సహకారంతో ఓ యువకుడి నిండు ప్రాణానికి ఆర్థిక భరోసా

ఆత్మకూరు ఆగస్టు 11 వార్త సాక్ష్యం

ఇటీవల కాలంలో జూపాడు బంగ్లా సమీపంలో కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామానికి చెందిన దినేష్ అనే యువకునికి రోడ్డు ప్రమాదంలో బలమైన గాయాలతో తలలో రక్త సరఫరా నిలిచిపోవడంతో ఆ యువకుడికి ఆపరేషన్ చేసేందుకు వైద్యులు 9 లక్షలు ఖర్చవుతుందని దినేష్ కుటుంబ సభ్యులకు తెలపడంతో సోమవారం మానవత దృక్పథంతో తుమ్మలూరు గ్రామానికి చెందిన ఆదర్శ యువజన సంఘం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 20,వేల 500, రూపాయలు నగదు ఆర్థిక సహాయం దినేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా తుమ్మలూరు ఆదర్శ యువజన సంఘం కమిటీ సభ్యులు, ఆత్మకూరు ఆర్టీసీ మెకానికల్ , డాల్ వెంకటేశ్వర్లు, ఆరోగ్యశాఖ టెక్నీషియన్, ప్రవీణ్, కూన రాజేష్, డల్ సూర్య, కూన సూరి, శేషన్న, డల్ కళ్యాణ్ లా ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించి ఆ యువకుడి నిండు ప్రాణానికి ఆర్థిక భరోసాను కల్పించారు



దాతల సహకారంతో ఆర్థిక స్థోమత లేని ఈ పేద కుటుంబానికి ప్రతి ఒక్కరు తమకు తోచినంత సహాయం అందించాలని తుమ్మలూరు ఆదర్శ యువజన సంఘం ముందుకు రావడంతో పలువురు ప్రజానీకం హర్షం వ్యక్తం చేశారు కొక్కెరంచ గ్రామ ప్రజలు తుమ్మలూరు గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పెండింగ్ ఫైళ్ల పరిష్కారం కోరి బీఆర్ఎస్ నిరసన

-గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ కు వినతి

వార్త సాక్ష్యం ఆగస్టు 17 నల్గొండ :

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి. ఇలియాస్ ఖాన్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జ్ లు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో రమణారెడ్డి కి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న



కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలని... అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఎలాంటి జాప్యం లేకుండా ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఒంటరి మహిళ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే మహిళలకు ఎమ్మార్వో కార్యాలయం ద్వారా ధృవీకరణ పత్రాలు సులభ పద్ధతిలో ఇవ్వాలని కోరారు. ప్రజా సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు చేయాలని... లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. అనంతరం నల్గొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ కు గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. కౌన్సిలర్ లు దీపిక విజయ్, జానకమ్మ దుర్గాప్రసాద్, లావుడి అరుణ, సందేశ్ రజిని, మర్రి అంజిబాబు, తిరుమలగిరి వజ్రం, వడ్డేపల్లి శ్రీనివాస్, జన్నపాల సునీత, ఎర్రమల్ల దినేష్, జానీ, వార్డు ఇంచార్జ్ లు రమావత్ భీమ్లా, ఐల వెంకన్న, కందగట్ల అశోక్, పందిరి వేణు, షేక్ మస్తాన్, భూక్య రాంబాబు షేక్ ఖలీల్, గౌటే కనకయ్య, ఎం.డి గయాస్, కడియం సైదులు, రాజనబోయిన గోపి తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

# పూలే, అంబేద్కర్ జీవితమే సందేశం నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి







-మహానీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి

-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

వార్త సాక్ష్యం ఆగస్టు17 మహబూబ్ నగర్ :

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే , డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సోమవారం ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించి, ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ, ఇంతటి గొప్ప కార్యక్రమంలో భాగస్వామి కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే , డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి మహానీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారి అడుగుజాడల్లో పయనిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, ముఖ్యంగా విద్యార్థులు చదువును జీవితంలో ప్రధాన లక్ష్యంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహానీయులు తమ జీవితాలను అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితం చేశారని, విద్య, జ్ఞానం ద్వారానే సమాజంలో నిజమైన మార్పు తీసుకురావచ్చని విశ్వసించారని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జ్ఞానాన్ని సంపాదించుకున్నప్పుడే రాజకీయ, ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాన్ని సంపూర్ణంగా సాధించగలరని తెలిపారు. పేద, అణగారిన వర్గాలకు చెందిన పిల్లలకు విద్య అందించడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ఇది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. "మన పిల్లలకు సరైన సాన్నిధ్యం, ప్రోత్సాహం, విద్య అందిస్తే వారు వజ్రాలుగా మారుతారు. లేకపోతే వారి ప్రతిభ మట్టిలో కలిసిపోయే ప్రమాదం ఉంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యలో ముందుకు వెళ్లేలా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రతి సమావేశంలోనూ ప్రజా సమస్యలతో పాటు పిల్లల చదువు, వారి భవిష్యత్తు, విద్యా అవకాశాలపై కూడా చర్చించాల్సిన అవసరం ఉందని చెప్పారు.మహబూబ్‌నగర్ నగరంలో విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వ విప్ తెలిపారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అనేక విద్యా సంస్థలను తీసుకొస్తున్నామని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాల వంటి ఉన్నత విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంస్థల ద్వారా ముఖ్యంగా పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని అన్నారు. ట్రిపుల్ ఐటీలో మహబూబ్‌నగర్ విద్యార్థులకు గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించుకున్నామని, వాటిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అంబేద్కర్, పూలే ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు రాబోయే ఐదు సంవత్సరాలను విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేయాలని ప్రభుత్వ విప్ పిలుపునిచ్చారు. "మన పిల్లలకు జ్ఞానం అందించాలి. వారికి సరైన మార్గదర్శకత్వం ఇవ్వాలి. వారు ఉన్నత విద్యను అభ్యసించి దేశంలోనే అత్యున్నత స్థానాలకు చేరేలా చేయాలి. ఇదే మహానీయుల ఆశయాలకు మనం ఇచ్చే నిజమైన గౌరవం" అని అన్నారు. పిల్లలకు పుస్తకాలు అందించడం, విద్యా సహాయం చేయడం, కౌన్సెలింగ్ ఇవ్వడం, ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ మరియు ఇతర అణగారిన వర్గాలకు సంబంధించిన సమస్యలు ఎక్కడ ఎదురైనా వాటిని గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. సమస్యలను కేవలం చర్చించడం కాకుండా వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, వినోద్ కుమార్, సత్తూర్ చంద్రకుమార్ గౌడ్,సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా , చీఫ్ ఇంజనీర్ బాలస్వామి, ఎస్ఈ భీమా నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు యూనివర్సిటీ ఉద్యమకారుల నూతన కమిటీ

-అధ్యక్షుడిగా సింగరిగళ్ళ బ్రహ్మం ఏకగ్రీవంగా



వార్త సాక్ష్యం ఆగస్టు17మహబూబ్ నగర్:

పాలమూరు యూనివర్సిటీ ఉద్యమకారుల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వనపర్తి జిల్లా కొప్పునూరు గ్రామానికి చెందిన యూనివర్సిటీ విద్యార్థి సింగరిగళ్ళ బ్రహ్మం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గౌరవ అధ్యక్షులుగా ఉల్లెంకొండ రాములు ఎన్మనబెట్ల గ్రామం, ఛైర్మెన్ అన్వర్, ఎన్మనబెట్ల ఎన్నికయ్యారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉద్యమకారులను గుర్తించాలని వారికి ఐడి కార్డ్, పెన్షన్,250 గజాల ఇంటి స్థలం, ఉద్యోగాల్లో పర్సెంటేజ్ ఆరోగ్య భద్రత కల్పించుటకై ఏర్పాటు చేసిన కేకే కమిటీ పై ఒత్తిడి పెంచే విధంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఉద్యమకారులను గుర్తించే వరకు పోరాటం కొనసాగిద్దామని తెలియజేశారు.గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా ఉద్యమకారులు విస్మరిస్తే సహించేది లేదని సూచించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై బిఆర్ఎస్ రణభేరి



వార్త సాక్ష్యం ఆగస్టు 17 రామగుండం :

తెలంగాణలో పేద ఆడబిడ్డలకు అండగా నిలిచే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిలిపివేయలని హై కోర్టులో వేసిన ప్రైవేట్ పిల్ కు కౌంటర్ దాఖలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మననియా కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం రామగుండం ఎమ్మార్వో ఆఫీస్ వద్ద రోడ్డును దిగ్బంధించి భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కౌశిక హరి , మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ , నాయకులు వ్యాల హరీష్ రెడ్డి , కార్పొరేటర్లు, మాజీ ఇంఛార్జ్ లు, మాజీ జెడ్పిటీసి లు, మాజీ సర్పంచులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.పేదలకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు.అని చెప్పారు.

# ఎస్సై, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ఫ్రీ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు పరిశీలన

వార్త సాక్ష్యం, ఆగస్టు 17 మందమర్రి:



పట్టణంలోకాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ ఇతర అన్ని పోటీ పరీక్షల కోసం కాకా ఫ్రీ కోచింగ్ సెంటర్. 60 రోజుల ఉచిత శిక్షణ ఏర్పాటుకు మందమర్రి తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న షెడ్డు స్థలాన్ని సోమవారం పరిశీలించి,ఎంపిక చేశారు.కోచింగ్ సెంటర్ కు అనుకూలంగా ఉన్నందున చుట్టూ పరిసరాలను చదును చేయించారు.ఈ కార్యక్రమం లో మందమర్రి తహశీల్దార్ సతీష్ కుమార్ శర్మ,మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాయలింగు,ఇతర అధికారులు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిరుమల్ రెడ్డి, నాయకులు గుడ్ల రమేష్,సునీల్,సాగర్, విజయ్,తదితరులు ఉన్నారు.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
మంగళవారం 18 ఆగష్టు, 2026

## 60వ డివిజన్‌లో డ్రైనేజ్ పనులపై మేయర్ ఆకస్మిక తనిఖీ

- నాణ్యత విషయంలో రాజీ లేదు.
- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్.



వార్త సాక్ష్యం ఆగస్టు 17 కరీంనగర్ :
నగరంలోని 60వ డివిజన్‌లో జరుగుతున్న డ్రైనేజ్ నిర్మాణ పనులను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పనుల ప్రదేశానికి చేరుకున్న మేయర్, డ్రైనేజ్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు పనుల నాణ్యతను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల్లో ఉపయోగిస్తున్న మెటీరియల్ నాణ్యత, నిర్మాణ ప్రమాణాలు, పనుల విధానం తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మేయర్ సూచించారు. డ్రైనేజ్ నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలకు తావు లేకుండా, నిర్దేశిత నిబంధనలు మరియు సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యమని, అభివృద్ధి పనులు నాణ్యతతో, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తామని నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరంలో చేపడుతున్న డ్రైనేజ్, రోడ్లు తదితర మౌలిక వసతుల పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని అధికారులను మేయర్ ఆదేశించారు.

## కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలి



వార్త సాక్ష్యం, ఆగస్టు 17 మందమర్రి:
కళ్యాణలక్ష్మి--షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మందమర్రి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు,చెన్నూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాలతో ఈ ఆందోళన చేపట్టినట్టు బిఆర్ఎస్ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్,అనుబంధ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల్లో ఏ ఒక్క పథకాన్ని రద్దు చేసినా సహించేది లేదని హెచ్చరించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులతో కలిసి గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నిరవధికంగా శాంతియుత పోరాటాలు చేపడతామని తెలిపారు. ఈ ధర్నా లో క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సంధ్యారాణి, డాక్టర్ రాజారమేష్, మందమర్రి మండల, పట్టణ, క్యాతన్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,టిబిజికెఎస్ యూనియన్ నాయకులు,వార్డు అధ్యక్షులు,యువజన, విద్యార్థి,సోషల్ మీడియా నాయకులు,మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే గృహనిర్బంధం

కామారెడ్డి, ఆగస్టు 17 ,వార్త సాక్ష్యం
కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను పోలీసులు గృహ నిర్బంధించారు. సదాశివ నగర్ మండలం తిరుమనపల్లిలో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లేందుకు వచ్చిన సురేందర్ ను కామారెడ్డిలో పోలీసులు అడ్డుకున్నారు. కామారెడ్డి నుంచి తిరుమనపల్లికి వెళ్లాల్సి ఉన్న సురేందర్ ను కామారెడ్డిలో పోలీసులు గృహ నిర్బంధించారు. తిరుమనపల్లి నుంచి లింగంపేటలో షాది ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేసిందని నిరసిస్తూ లింగంపేటలో ధర్నా ర్యాలీ కార్యక్రమానికి పిలుపునిచ్చిన జాజాల సురేందర్ ను పోలీసులు కామారెడ్డి లోని అడ్డుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నిరంజన్ రెడ్డికి అభినందనల వెల్లువ

వార్త సాక్ష్యం ఆగస్టు 17 కరీంనగర్ :
కరీంనగర్ సీఐ అనుముల నిరంజన్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. నక్సల్స్ కార్యకలాపాలు నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో విశేష కృషి చేసిన ఆయన ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్నారు. ఆగస్ట్15న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మెడల్ అందుకున్న నేపథ్యంలో ఆయనను పలువురు అభినందించారు.

**"కంగ్రాట్స్ సీపీ గౌష్ ఆలం"**

సోమవారం కరీంనగర్ సీపీ గౌష్ ఆలంను రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి కలిశారు. విధి నిర్వహణలో ధైర్య సహాసాలు ప్రదర్శించిన సీఐ నిరంజన్ రెడ్డి అందించిన సేవలు ఆదర్శప్రాయమన్నారు. ఇండియన్ పోలీస్ మెడల్ అందుకోవడం కరీంనగర్ కమిషనరేట్ కే గర్వకారణం అని అన్నారు. పోలీస్ విభాగంలో శ్రమించి పని చేసిన వారికి గుర్తింపు ఎప్పటికైనా లభిస్తుందన్నారు. సమాజ హితం కోసం



పని చేసి ఇలాంటి అరుదైన మెడల్స్ కు ఎంపిక కావాలని సీపీ పిలుపునిచ్చారు.

**"ప్రజలు"**

కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డికి పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. ఐపీఎం అందుకున్న సీఐని ఘనంగా సత్కరించారు.

**"ఘన స్వాగతం"**

ఐపీఎం అందుకున్న తర్వాత తొలిసారి పోలీస్ స్టేషన్



కు చేరుకున్న నిరంజన్ రెడ్డికి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అత్యంత అరుదైన మెడల్ అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. నిరంజన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉందని పోలీస్ స్టేషన్ సిబ్బంది అభిప్రాయపడ్డారు.

# విద్యారణ్యపురి, బాలాజీనగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వార్త సాక్ష్యం ఆగస్టు 17 కరీంనగర్ :
నగరపాలక సంస్థ కరీంనగర్ పరిధిలో అభివృద్ధి పనులకు వేగంగా శ్రీకారం చుడుతున్నట్లు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగరపాలక సంస్థ 3వ డివిజన్ విద్యారణ్యపురిలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. కాలనీల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ సాదినేని లావణ్య మునిందర్, కాలనివాసులు బోడ మల్లారెడ్డి, ఇనుగాల నారాయణ రెడ్డి, గుర్రం విలాస్ రెడ్డి, కొత్త చొక్కా రెడ్డి,ముత్యాల మల్లారెడ్డి, బురికి కొమురయ్య, వేములవాడ మధుసుధనా చారి, కళ్ళెం మధుసూదన్ రెడ్డి, అరికొంతం మనోహర్ రెడ్డి, ఎర్రంరెడ్డి అమరేందర్




రెడ్డి, కూర ఆంజనేయులు,గాజుల సుదర్శన్, గంధం లక్ష్మయ్య, ఉమ్మెంతల మనోహర్ రెడ్డి, మంద నరేందర్ రెడ్డి, నోముల జగన్ మోహన్ రెడ్డి, వెల్మ కిషన్ రెడ్డి, చిరంజీవి, సూర శ్రీనివాస్,బోడ శ్రీధర్ రెడ్డి, ఏనుగు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**-23వ డివిజన్ బాలాజీనగర్ లో....**

అనంతరం 23వ డివిజన్ బాలాజీనగర్ లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని, నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నగర అభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, 23వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి రాజ్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, 21వ డివిజన్ కార్పొరేటర్ వరాల నర్సింగం, మున్సిపల్ అధికారులు, నాయకులు, కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

-పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.

వార్త సాక్ష్యం ఆగస్టు 17 రామగుండం :
బాధితుల నుంచి అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్,సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలపై పారదర్శకంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిగణించి,




నిర్ణీత సమయంలో పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ నిరంతరం కృషి చేస్తోందని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పీ.యం.జే. జ్యువెలర్స్ బందిపోటు దొంగల ముఠాపై పీడీ యాక్ట్

-కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం.

వార్త సాక్ష్యం ఆగస్టు 17 కరీంనగర్ :
కరీంనగర్ పట్టణంలోని పీ.యం.జే. జ్యువెలర్స్‌లో జరిగిన సంచలన బందిపోటు దొంగతనం కేసులో ప్రధాన నిందితులైన ఐదుగురు ముఠా సభ్యులపై కరీంనగర్ పోలీసులు పీడీ యాక్ట్ (ప్రివెంటివ్ డిటెన్షన్) అమలు చేశారు. 2026 మే 3న పీ.యం.జే. జ్యువెలర్స్ షాపులోకి చొరబడిన నిందితులు సిబ్బందిపై తుపాకులతో కాల్పులు జరిపి, సుమారు రూ.82 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ప్రధాన నిందితులైన 1).రఘునాథ్ కర్మాకర్ ఏ జాగీరా సింగ్, 41 సంవత్సరాలు,పశ్చిమ బెంగాల్, 2). రావిష్ కుమార్ ఏ ప్రద్యుమాన్, 23 సంవత్సరాలు, నలంద జిల్లా, బీహార్,3). సూర్యమణి కుమార్ ఏ సనోజ్, 21 సంవత్సరాలు, నలంద జిల్లా, బీహార్, 4). యాదవ్ ఏ జైనుల్ అబ్దీన్, 33 సంవత్సరాలు, ప్రస్తుతం ఫుల్వారీ షరీఫ్, పాట్నా జిల్లా, బీహార్, 5). మొహమ్మద్ ఆదిల్ ఖాన్, 31 సంవత్సరాలు, ఫుల్వారీ షరీఫ్, పాట్నా జిల్లా, బీహార్. ఈ ఐదుగురిపై 17-08-2026న



పీడీ యాక్ట్ అమలు చేశారు. నిందితుల నేర కార్యకలాపాలను అరికట్టడం, ప్రజల భద్రతకు భరోసా కల్పించడం, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిలో భయాన్ని కలిగించేందుకు పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను కరీంనగర్ జిల్లా జైలులో నిందితులకు అందజేసి, అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. పీడీ యాక్ట్ అమలులో కీలక పాత్ర పోషించిన కరీంనగర్ పట్టణ ఏసీపీ ఎన్.వెంకటస్వామి, కరీంనగర్ రెండవ పట్టణ సీఐ కె.సృజన్ రెడ్డిలను పోలీస్ కమిషనర్ అభినందించారు. నేరాలకు పాల్పడే వారిపై కరీంనగర్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే నేరస్థులపై చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# బిజినెస్

# భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో చారిత్రాత్మక ఘట్టం: ల్యాండ్ అయిన తొలి కమర్షియల్ విమానం!

-అల్లూరి సీతారామరాజు' విమానాశ్రయంలో వాణిజ్య సర్వీసులు ప్రారంభం
-ఉదయం 6:45 గంటలకు ల్యాండ్ అయిన తొలి ఇండిగో విమానం
-ప్రయాణికులకు ఏటికొప్పాక బొమ్మలతో ఘన స్వాగతం పలికిన అధికారులు
-విశాఖ పాత ఎయిర్‌పోర్ట్ నుంచి పౌర విమాన సేవలు పూర్తిగా బదిలీ
-ఉత్తరాంధ్ర పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి ఇది దోహదం చేస్తుందని అంచనా




ఉత్తరాంధ్ర విమానయాన చరిత్రలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' నుంచి వాణిజ్య విమాన సర్వీసులు సోమవారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ నుంచి బయలుదేరిన ఇండిగో 6ఈ6408 విమానం ఉదయం 6:45 గంటలకు భోగాపురం రన్‌వేపై విజయవంతంగా ల్యాండ్ అవ్వడంతో ఇక్కడ కార్యకలాపాలు లాంఛనంగా మొదలయ్యాయి. నూతన విమానాశ్రయానికి చేరుకున్న తొలి విమానానికి, అందులోని ప్రయాణికులకు ఎయిర్‌పోర్ట్ నిర్వాహక సంస్థ జీఎంఆర్, పౌర విమానయాన శాఖ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. తొలి ప్రయాణానికి గుర్తుగా ప్రయాణికులకు ధ్రువీకరణ పత్రాలతో పాటు, స్థానిక సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఏటికొప్పాక బొమ్మలను జ్ఞాపికలుగా అందజేశారు. దీని తర్వాత కొద్దిసేపటికే బెంగళూరు నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం కూడా ఇక్కడ ల్యాండ్ అయింది. భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో, విశాఖపట్నంలోని పాత ఎయిర్‌పోర్ట్ నుంచి నడిచే పౌర విమాన సర్వీసులన్నింటినీ ఇక్కడికే మార్చారు. తొలిరోజే హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి దేశంలోని ప్రధాన నగరాలకు విమానాలు రాకపోకలు సాగించనున్నాయి. నేడు మొత్తం 31 సర్వీసులు నడవనుండగా, దాదాపు 7 వేల మంది రాకపోకలు సాగించనున్నారు. ఇక విశాఖ నుంచి గత రాత్రి (ఆదివారం) 10.45 గంటలకు చివరి విమానం ఢిల్లీకి బయలుదేరింది. ఆ తర్వాత వాణిజ్య సేవలు నిలిచిపోయాయి. ఈ అత్యాధునిక విమానాశ్రయం ప్రారంభం కావడం ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక, ఐటీ, పర్యాటక రంగాలు వేగంగా విస్తరించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని దేశీయ, అంతర్జాతీయ సర్వీసులు ఇక్కడి నుంచి ప్రారంభం కానున్నాయి.

# రవీంద్ర జడేజా అరుదైన ఘనత.. తొలి భారత లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా సరికొత్త చరిత్ర

-టెస్టుల్లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్న రవీంద్ర జడేజా
-ఈ ఘనత సాధించిన తొలి భారత లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా రికార్డు
-టెస్టుల్లో 350 వికెట్లు తీసిన ఐదో భారత బౌలర్‌గా ఘనత
-4000 పరుగులు, 350 వికెట్లతో కపిల్ దేవ్ సరసన అరుదైన డబుల్




టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా తన సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌లో మరో అద్భుతమైన మైలురాయిని అందుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో 350 వికెట్లు పడగొట్టిన తొలి భారత లెఫ్ట్ ఆర్మ్ బౌలర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో ఈ ఘనత సాధించాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు దూరంగా ఉన్న జడేజా, ఈ మ్యాచ్‌తో పునరాగమనం చేసి వెంటనే తనదైన ముద్ర వేశాడు. సోమవారం, మ్యాచ్ మూడో రోజు ఆటలో భాగంగా శ్రీలంక ఆల్ రౌండర్ కేశర నువంతను ఔట్ చేయడం ద్వారా జడేజా ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. జడేజా వేసిన బంతిని నువంత కవర్స్ వైపు బలంగా కొట్టగా, అది సిల్లీ పాయింట్‌లో ఉన్న యశస్వి జైస్వాల్ తొడకు తగిలి గాల్లోకి లేచింది. సమీపంలోనే ఉన్న శుభ్‌మన్ గిల్ చాకచక్యంగా క్యాచ్ అందుకోవడంతో జడేజా 350వ వికెట్ పూర్తయింది. ఈ మైలురాయితో, టెస్టుల్లో 350 వికెట్లు తీసిన ఐదో భారత బౌలర్‌గా జడేజా నిలిచాడు. అతని కంటే ముందు దిగ్గజాలు అనిల్ కుంబ్లే (619), రవిచంద్రన్ అశ్విన్ (537), కపిల్ దేవ్ (434), హర్భజన్ సింగ్ (417) మాత్రమే ఈ జాబితాలో ఉన్నారు. ఇప్పటివరకు భారత లెఫ్ట్ ఆర్మ్ బౌలర్లలో జహీర్ ఖాన్ (311 వికెట్లు) పేరిట ఉన్న రికార్డును జడేజా అధిగమించాడు. అంతేకాకుండా, ప్రపంచ క్రికెట్‌లోనూ జడేజా అత్యంత అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. టెస్టుల్లో 4,000కు పైగా పరుగులు, 350కి పైగా వికెట్లు తీసిన నాలుగో ఆటగాడిగా నిలిచాడు. గతంలో ఈ రికార్డును కపిల్ దేవ్, ఇయాన్ బోథమ్, డేనియల్ వెటోరి మాత్రమే సాధించారు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఘనత సాధించిన మూడో లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కూడా జడేజానే కావడం విశేషం.

# క్రీడలు

## గాలే టెస్టు: భారత బౌలర్ల ధాటికి లంక తడబాటు

భారత్‌తో తొలి టెస్టులో కష్టాల్లో శ్రీలంక
మూడో రోజు ఆట ముగిసేసరికి 272/7 స్కోరు
కీలక ఇన్నింగ్స్ ఆడిన నిరోషన్ డిక్వెలా (80)
సెంచరీకి ఒక్క పరుగు దూరంలో సోనల్ దినూష (99బి)
భారత్‌కు ఇంకా 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం



గాలే వేదికగా భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో శ్రీలంక కష్టాల్లో పడింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. యువ బ్యాటర్ సోనల్ దినూష (99 బ్యాటింగ్) సెంచరీకి కేవలం ఒక్క పరుగు దూరంలో అజేయంగా నిలిచాడు. భారత జట్టు కంటే శ్రీలంక ఇంకా 190 పరుగులు వెనుకబడి ఉంది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్ లో 116.4 ఓవర్లలో 462 పరుగులకు ఆలౌట్ అయింది. భారత తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సమాధానంగా బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో ఓపెనర్ నిషాన్ ఫెర్నాండో డకౌట్ కాగా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. దీంతో 90 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి లంక పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెలా (80), సోనల్ దినూష కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. 115 బంతుల్లో 7 ఫోర్లతో 80 పరుగులు చేసిన డిక్వెలాను ప్రసిద్ధ్ కృష్ణ ఔట్ చేసి ఈ భాగస్వామ్యానికి తెరదించాడు. అయితే, మరో ఎండ్‌లో సోనల్ దినూష ఓపిగ్గా ఆడుతూ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 163 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 99 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ప్రస్తుతం అతనితో పాటు ప్రభాత్ జయసూర్య (9బి) బ్యాటింగ్ చేస్తున్నాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా, మానవ్ సుతార్ చెరో రెండు వికెట్లు తీయగా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. నాలుగో రోజు ఆటలో దినూష సెంచరీ పూర్తి చేసుకుని, లోయర్ ఆర్డర్‌తో కలిసి ఆధిక్యాన్ని ఎంతవరకు తగ్గిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

# సుతార్, జడేజా స్పిన్ ధాటికి లంక విలవిల.. భారత్‌కు 178 పరుగుల ఆధిక్యం

-తొలి టెస్టులో శ్రీలంకపై భారత్ పట్టు
-4 వికెట్లతో రాణించిన యువ స్పిన్నర్ మానవ్ సుతార్
-3 వికెట్లు పడగొట్టి 350 వికెట్ల మైలురాయి అందుకున్న రవీంద్ర జడేజా
-అరంగేట్ర సెంచరీతో ఒంటరి పోరాటం చేసిన శ్రీలంక బ్యాటర్ సోనల్ దినూష
-వర్షం కారణంగా ముందుగానే ముగిసిన మూడో రోజు ఆట



గాలేలో శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు పట్టు బిగించింది. యువ స్పిన్నర్ మానవ్ సుతార్, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా స్పిన్ మాయాజాలంతో మూడో రోజు శ్రీలంకను తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో భారత్‌కు 178 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. సోనల్ దినూష (100) అద్భుతమైన సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా జట్టును ఆదుకోలేకపోయాడు. వర్షం కారణంగా సోమవారం ఆటను ముందుగానే నిలిపివేశారు. అంతకుముందు, ఉదయం 462 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను ముగించిన భారత్, బౌలింగ్‌లోనూ ఆది నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. మహమ్మద్ సిరాజ్ తాను వేసిన రెండో బంతికే ఓపెనర్ మదుష్కను డకౌట్ చేశాడు. ఆ తర్వాత స్పిన్నర్లు రంగంలోకి దిగారు. ఈ పర్యటనపై భారీ అంచనాలతో వచ్చిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్, తాను వేసిన తొలి బంతికే దినేశ్ చండీమల్‌ను ఔట్ చేసి సత్తా చాటాడు. పదునైన బంతులతో టర్న్, బౌన్స్ రాబట్టిన సుతార్ మొత్తం 4 వికెట్లు పడగొట్టాడు. మరోవైపు రవీంద్ర జడేజా 3 వికెట్లతో రాణించి, టెస్టు క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. కుల్దీప్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలో వికెట్ పంచుకున్నారు. ఒక దశలో 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి శ్రీలంక ఫాలోఆన్ ముంగిట నిలిచింది. ఈ క్లిష్ట సమయంలో సోనల్ దినూష, నిరోషన్ డిక్వెల్లా (80) అద్భుతంగా పోరాడారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. దాదాపు మూడేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన డిక్వెల్లా అర్ధశతకంతో ఆకట్టుకోగా, దినూష తన అరంగేట్ర సెంచరీతో మెరిశాడు. అయితే, 80 పరుగులు చేసిన డిక్వెల్లాను ప్రసిద్ధ్ కృష్ణ ఔట్ చేయడంతో ఈ భాగస్వామ్యం విడిపోయింది. ఆ తర్వాత లంక ఇన్నింగ్స్ మళ్లీ పేకమేడలా కూలింది. చివరి 5 వికెట్లను కేవలం 50 పరుగుల తేడాతో కోల్పోయింది. దినూష శతకం పూర్తి చేసుకున్న వెంటనే జడేజా అతడిని ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది.

వార్త సాక్షము తెలుగు దిన పత్రిక

మంగళవారం 18 ఆగష్టు , 2026

# భారత్‌లో 'స్పైడర్ మ్యాన్' వసూళ్ల సునామీ.. రూ. 500 కోట్లు కొల్లగొట్టిన హాలీవుడ్ చిత్రం.. వరల్డ్‌వైడ్‌గా ఎంత రాబట్టిందంటే!




వరల్డ్‌వైడ్‌గా 2 బిలియన్ డాలర్ల మార్క్‌ను దాటిన స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ భారత బాక్సాఫీస్ వద్ద రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన చిత్రం ఇండియాలో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రంగా సరికొత్త రికార్డ్ జులై 31న విడుదలైన ఈ సినిమాకు డెస్టిన్ డానియల్ దర్శకత్వం హాలీవుడ్ స్టార్స్ టామ్ హాలండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ హీరో చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. జులై 31న విడుదలైన ఈ సినిమా, అంచనాలకు మించి భారీ విజయాన్ని నమోదు చేస్తూ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద 2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 19,120 కోట్లు) మార్క్‌ను దాటింది. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) నుంచి 38వ చిత్రంగా వచ్చిన ఈ సినిమా, కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా సంస్థ 'ది హాలీవుడ్ రిపోర్టర్' కథనం ప్రకారం.. ఈ చిత్రం ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 2.02 బిలియన్ డాలర్లను వసూలు చేసింది. కేవలం గ్లోబల్ మార్కెట్‌లోనే కాకుండా భారతీయ బాక్సాఫీస్ వద్ద కూడా ఈ చిత్రం ప్రభంజనం సృష్టించింది. ఇండియాలో రూ. 500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ఇక్కడ అత్యధిక వసూళ్లు రాబట్టిన హాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. భారీ విజయాలు సాధించిన క్రిస్టోఫర్ నోలన్ చిత్రం 'ది ఒడిస్సీ', 'అబ్సెషన్' రికార్డులను ఇది బద్దలు కొట్టింది. డెస్టిన్ డానియల్ క్రెటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టామ్ హాలండ్ మరోసారి స్పైడర్ మ్యాన్‌గా అద్భుతమైన నటన కనబరిచారు. జెండయా... మిచెల్ జోన్స్-వాట్సన్ పాత్రలో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో స్పైడర్ మ్యాన్ ఒక కొత్త, శక్తిమంతమైన ప్రతినాయకుడిని ఎదుర్కోవడమే కాకుండా, శారీరకంగా ఊహించని మార్పులకు లోనవుతాడు. ఈ కాన్సెప్ట్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. కెవిన్ ఫేజ్, అమీ పాస్కల్ నిర్మించిన ఈ చిత్రంలో జాకబ్ బటాలన్ (నెడ్ లీడ్స్), క్రోండన్ (టూంబ్‌స్టోన్), శాడీ సింక్ (జీన్ గ్రే) ముఖ్య పాత్రలు పోషించారు. వీరితో పాటు మార్క్ రఫెలో (హల్క్), జోన్ బెర్న్‌తల్ (పనిషర్), మైఖేల్ మాండో (స్కార్పియన్) వంటి ప్రముఖ నటులు కూడా ఈ సినిమాలో భాగమై అదనపు ఆకర్షణగా నిలిచారు. మొత్తం మీద 'బ్రాండ్ న్యూ డే' మార్వెల్ స్టూడియోస్‌కు మరో భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిపోయింది.

## అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుంది మరి!



'మిరాయ్'తో మెప్పించిన రితికా బలమైన కథ కోసమే తీసుకున్న గ్యాప్ 'కొరియన్ కనకరాజు'తో భారీ హిట్ మరిన్ని అవకాశాలతో దూసుకు పోయే ఛాన్స్ ఒకప్పుడు మీనా .. రంభ .. నగ్మా వంటి బొద్దుగా ఉన్న బ్యూటీలు తెలుగు తెరను ఒక ఊపు ఊపేశారు. స్టార్ హీరోలతో కలిసి వరుస విజయాలను అందుకుంటూ, తమ కెరియర్ ను పరుగులు తీయించారు. అలా కాస్త బొద్దుగా కనిపిస్తూ .. క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో ఈ మధ్య కాలంలో యూత్ ను ఆకట్టుకున్న బ్యూటీగా రితికా నాయక్ కనిపిస్తుంది. 'మిరాయ్' సినిమాలో ఈ సుందరిని చూసిన కుర్రాళ్లు, థియేటర్స్ దగ్గరే మనసులు పోగొట్టుకున్నారు. ఈ ముద్దుగుమ్మ నెలకో సినిమా చేస్తే బాగుండునే అనుకున్నారు. కానీ 'మిరాయ్' మాదిరిగానే తనకి బాగా నచ్చే కంటెంట్ కోసం రితికా ఎదురుచూస్తూ వచ్చిందనే విషయం, 'కొరియన్ కనకరాజు' రిలీజ్ తరువాతనే అర్థమవుతోంది. రీసెంటుగా విడుదలైన ఈ సినిమా, అనూహ్యమైన రెస్పాన్స్ ను అందుకుంది. కొంత కాలంగా అసంతృప్తిగా ఉన్న వరుణ్ తేజ్ కి ఈ సినిమా ఫలితం ఊరటను ఇచ్చింది .. కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ సినిమాలోను నటన పరంగా .. గ్లామర్ పరంగా రితికా మంచి మార్కులు కొట్టేసింది. అందానికి అదృష్టం తోడైతే ఇలాగే ఉంటుందని అనిపించింది. కొంత కాలంగా టాలీవుడ్ లో హీరోయిన్స్ వైపు నుంచి సందడి తగ్గిందనే చెప్పాలి. ఒకటి రెండు సినిమాలు చేసుకుపోతున్నారే తప్ప, నిలకడగా ఎవరూ సక్సెస్ లు సాధించలేకపోతున్నారు. టాప్ త్రీ .. టాప్ 5 అంటూ గతంలో మాదిరిగా ఒక జాబితా చూసుకుంటే, ఎవరూ కనిపించని ఒక గందరగోళం ఉంది. అలాంటి పరిస్థితుల్లో మరో భారీ హిట్ ను అందుకున్న రితికా, మరిన్ని అవకాశాలతో బిజీ అవుతుందేమో చూడాలి.

## కావ్యా మారన్-అనిరుధ్ రవిచందర్ పెళ్లి..? ఈసారి తేదీ, వేదిక కూడా వచ్చేశాయి!

-కావ్య మారన్, అనిరుధ్ పెళ్లిపై మళ్లీ ఊపందుకున్న ఊహాగానాలు
-ఈసారి ఏకంగా తేదీ, వేదికను ప్రస్తావిస్తూ జోరుగా ప్రచారం
-నవంబర్ 10న గ్రీస్‌లో వీరి వివాహం అంటూ కథనాలు
-ప్రైవేట్‌గా డెస్టినేషన్ వెడ్డింగ్ ప్లాన్ చేస్తున్నారంటూ చర్చ
-ఇరు కుటుంబాల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు



సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్, సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ పెళ్లి చేసుకోబోతున్నారంటూ గతంలో ఎన్నోసార్లు ఊహాగానాలు వినిపించాయి. అయితే, ఆ వార్తల్లో ఎప్పుడూ స్పష్టత ఉండేది కాదు. కానీ ఈసారి మాత్రం ఏకంగా పెళ్లి తేదీ, వేదికతో సహా వార్తలు ప్రచారంలోకి రావడంతో ఈ వ్యవహారం మరోసారి ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో వచ్చిన పుకార్లకు, ఇప్పటి ప్రచారానికి మధ్య ఇదే ప్రధానమైన తేడా. వివరాల్లోకి వెళితే, కావ్య మారన్, అనిరుధ్ రవిచందర్ ఈ ఏడాది నవంబర్ 10న వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారని సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. వీరి పెళ్లికి గ్రీస్ వేదిక కానుందని కథనాలు వస్తున్నాయి. తొలుత సీషెల్స్‌లో వీరి వివాహం జరుగుతుందని ప్రచారం జరిగినా, తాజాగా గ్రీస్ పేరు బలంగా వినిపిస్తోంది. భారీ ఎత్తున కాకుండా, కేవలం అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య డెస్టినేషన్ వెడ్డింగ్‌గా దీన్ని ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. వివాహం తర్వాత మరికొన్ని ప్రదేశాల్లో ఇద్దరూ కలిసి సమయం గడపాలని కూడా నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. కావ్య మారన్ సన్ నెట్‌వర్క్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తెగా, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు వ్యవహారాలు చూసుకుంటూ ఐపీఎల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. మరోవైపు, అనిరుధ్ తన సంగీతంతో దక్షిణాదిని, ఉత్తరాదిని ఒకేలా ఉర్రూతలూగిస్తున్న స్టార్ కంపోజర్. వీరిద్దరి మధ్య స్నేహం ఉందని, అది ప్రేమగా మారిందని ఎప్పటినుంచో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో వచ్చిన ఊహాగానాలను ఇరు పక్షాలు ఖండించలేదు, అలాగని అంగీకరించనూ లేదు. అయితే, ఈసారి పెళ్లి తేదీ, ప్రదేశం వంటి వివరాలు బయటకు రావడంతో ఈ వార్తల్లో నిజం ఉండొచ్చని చాలామంది భావిస్తున్నారు. ఏదేమైనా, ఈ వార్తలపై ఇప్పటివరకు కావ్య లేదా అనిరుధ్ కుటుంబాల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ ప్రచారంలో ఎంతవరకు వాస్తవం ఉందో తెలియాలంటే, ఇరు కుటుంబాల్లో ఎవరో ఒకరు స్పందించే వరకు వేచి చూడాల్సిందే.

## సినీ ప్రేమికులు తప్పక చూడాల్సిన సినిమా ఇది: అల్లు అర్జున్

-'డిసి' సినిమాను 'తమిళ క్లాసిక్' అని కొనియాడిన అల్లు అర్జున్
-ప్రతీ సినీ ప్రేమికుడు చూడాల్సిన కళాఖండం అని వ్యాఖ్య
-దర్శకుడు అరుణ్, సంగీత దర్శకుడు అనిరుధ్‌పై ప్రశంసలు
-హీరోగా నటించిన లోకేశ్ కనగరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించిన బన్నీ
-ఈ రివ్యూతో అల్లు అర్జున్-లోకేశ్ కాంబోపై ఊహాగానాలకు మరింత బలం



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ఇటీవల విడుదలైన తమిళ థ్రిల్లర్ 'డిసి' సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈ చిత్రాన్ని ఒక 'తమిళ క్లాసిక్'గా అభివర్ణిస్తూ, ప్రతీ సినిమా ప్రేమికుడు తప్పక చూడాల్సిన కళాఖండం అని సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఆయన తాజా రివ్యూ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. "'డిసి' చూశాను! ఇదొక తమిళ క్లాసిక్. ప్రతీ సినిమా ప్రేమికుడు తప్పక చూడాలి. దీన్ని అర్థం చేసుకున్న వారికి ఇది ఒక కవిత్వం లాంటిది" అంటూ అల్లు అర్జున్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. చిత్ర బృందానికి అభినందనలు తెలుపుతూ, దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్‌కు తన అత్యున్నత గౌరవాన్ని తెలియజేశారు. రాకీ, సాని కాయిధమ్, కెప్టెన్ మిల్లర్ వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అరుణ్ పనితనాన్ని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. సినిమాకు తన సంగీతంతో ప్రాణం పోసిన అనిరుధ్ రవిచందర్‌ను 'అబ్సొల్యూట్ మాస్టర్ బూస్టర్' అని పొగిడిన బన్నీ, సాంకేతికంగా సినిమా అత్యున్నత స్థాయిలో ఉందని అన్నారు. ఇక ఈ చిత్రంలో కథానాయకుడిగా నటించిన ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌ను 'ప్రాజెక్ట్‌కు అతిపెద్ద ఆధారం' అని అభివర్ణించారు. ఆ పాత్రలో లోకేశ్ జీవించారని ప్రశంసించారు. కథానాయిక వామికా గబ్బితో పాటు ఇతర నటీనటులందరూ అద్భుతంగా నటించారని తెలిపారు. ప్రస్తుతం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ట్రెండ్ అవుతున్న ఈ సినిమాకు అల్లు అర్జున్ రివ్యూ మరింత బూస్ట్ ఇచ్చింది. ఇప్పటికే ఈ సినిమాను సూపర్ స్టార్ మహేశ్ బాబు కూడా మెచ్చుకున్న సంగతి తెలిసిందే. కాగా, అల్లు అర్జున్ తన తదుపరి చిత్రం 'రాకా' (దర్శకుడు అట్లీ) తర్వాత లోకేశ్ కనగరాజ్‌తో ఒక సినిమా చేసే అవకాశం ఉందంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో లోకేశ్ నటనను బన్నీ ప్రత్యేకంగా ప్రశంసించడం ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం, అల్లు అర్జున్ రివ్యూతో తెలుగు ప్రేక్షకుల్లో కూడా ఆసక్తిని పెంచింది.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.